క్లుప్తంగా

26,704 మందికి సున్నావడ్డీతో లబ్ధి

పెనమలూరు: జిల్లాలో అత్యధిక స్వయం సహాయక గ్రూపులు ఉన్న పెనమలూరు మండలంలో అక్కాచెల్లెమ్మలకు సున్నావడ్డీ జమ చేయటానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మండలంలో 2022-2023 సంవత్సరంలో 2,621 స్వయం సహాయక గ్రూపులు ఉండగా అందులో 26,704 మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సున్నావడ్డీ కింద నాలుగో విడత రూ.2.98 కోట్లను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో శుక్రవారం జమచేయనుంది. వైఎస్సార్ సున్నావడ్డీ పథకం కింద మూడు సంవత్సరాలుగా స్వయం సహాయ సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. 2019-2020 సంవత్సరంలో 2014 గ్రూపులకు చెందిన 19,133 మందికి రూ.1.39 కోట్లు, 2020-2021లో 2,157 గ్రూపులకు చెందిన 20,492 మందికి రూ.1.24 కోట్లు, 2021-2022లో 2,417 గ్రూపులకు చెందిన 24,408 మంది సభ్యులకు రూ.1.79 కోట్ల చొప్పున లబ్ధి చేకూరింది. మండల పరిధిలో స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న అర్హులందరికీ సున్నావడ్డీ కింద ప్రభుత్వ సాయం అందుతోందని పెనమలూరు ఏపీఎం ఎర్రంశెట్టి రాజగోవింద్ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండల కేంద్రమైన పెనమలూరులో ఓ విద్యార్థిని కాలేజీకి వెళ్లి అదృశ్యమైన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. పెనమలూరు రజకులకాలనీకి చెందిన 19 ఏళ్ల విద్యార్థిని విజయవాడలోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. ఈ నెల 9వ తేదీన కాలేజీలో ప్రాక్టికల్స్ ఉన్నాయని ఇంట్లో చెప్పి వెళ్లింది. అయితే ఆమె ప్రాక్టికల్స్‌కు హాజరు కాలేదని తల్లిదండ్రులకు కాలేజీ నుంచి ఫోన్ వచ్చింది. దీంతో విద్యార్థిని కోసం తల్లిదండ్రులు పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గండిగుంటలో వార్డు మెంబరుకు నామినేషన్లు



ఉయ్యూరు: మండలంలోని గండిగుంట పంచాయతీ పదోవార్డుకు ఉప ఎన్నిక ప్రక్రియ మొదలైంది. ఖాళీగా ఉన్న వార్డు స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటంతో అధికారులు ఎన్నిక ప్రక్రియ ప్రారంభించారు. బీసీ-బీ కి రిజర్వ్ అయిన వార్డు స్థానానికి వైఎస్సార్ సీపీ బలపర్చిన మోర్ల యోగేశ్వరరావు, నందం జోగేశ్వరరావు, సాయి కిరణ్ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారికి గురువారం నామినేషన్లను అందించారు. ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బందెల శ్రీనివాసరావు, నాయకులు గెత్తం విజయ్‌కుమార్, గొల్లపూడి వేణుబాబుతో కలిసి నామినేషన్‌లను వేశారు. లీలావతి, పాండురంగారావు టీడీపీ మద్దతుతో నామినేషన్‌లను దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని ఎంపీడీఓ విమాదేవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: మండలంలోని కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడ మూడో వార్డు సచివాలయంలో పని చేస్తున్న ఉద్యోగిని, మరో మహిళా వలంటీర్ గాయపడ్డారు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. కానూరు కామినేనినగర్‌కు చెందిన దేవరాజుగుట్టు గాయత్రి వలంటీర్‌గా పని చేస్తోంది. బుధవారం ఉదయం గాయత్రి, సచివాలయం ఉద్యోగి జ్యోతిశ్రీ ద్విచక్ర వాహనంపై కామినేనినగర్‌కు వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయత్రి, జ్యోతిశ్రీ గాయపడటంతో వారిని విజయవాడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: మండలంలోని పోరంకి సెక్షన్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు గురువారం తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు పోరంకి సెంటర్, ప్రభునగర్, డొంక రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. స్థానికులు సిబ్బందితో సహకరించాలని కోరారు.

సిటీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి వద్ద గురువారం ఆర్టీసీ సిటీ బస్సుకు తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా వున్నాయి. గవర్నర్ పేట-2 డిపోకు చెందిన 116 నంబరు బస్సు ఉదయం 11.30 గంటలకు ప్రయాణికులతో గన్నవరానికి బయలుదేరింది. కేసరపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పైవంతెన వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి ఫ్లై ఓవర్ వైపుగా దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. బస్సు ఒక్కసారిగా అదుపుతప్పడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి



వణుకూరులో శిలాఫలకం వద్ద ఎంపీడీఓ సునీతాశర్మ, సర్పంచి చక్క విజయ



ప్రసాదంపాడు సచివాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పెనమలూరు: మండలంలోని వణుకూరు గ్రామంలో నా భూమి – నా దేశం కార్యక్రమం గురువారం జరిగింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ భాగంగా నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతా శర్మ, సర్పంచి యక్క విజయ పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను సర్వదా స్మరించుకోవాలన్నారు. బుధవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు గ్రామాల్లో నా భూమి – నా దేశం కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. గ్రామ సచివాలయం వద్ద శిలాఫలకం ఏర్పాటు చేసి ముఖ్యనేతల పేర్లు రాశారు. అమర వీరులు, యుద్ధ వీరులకు నివాళులర్పించారు. స్వచ్ఛమైన నీరు, సారవంతమైన నేల భావి తరాలకు అందిస్తామని, పుడమి తల్లిని కాపాడుతామని గ్రామస్తులతో ఎంపీడీఓ సునీతాశర్మ ప్రతిజ్ఞ చేయించారు. గంగూరు సచివాలయం వద్ద కూడా నాభూమి-నాదేశం కార్యక్రమం జరిగింది. ఏవో ఎల్.శివశంకర్‌రావు, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, గ్రామ పంచాయ వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఇంజినీరింగ్ విద్యార్థులు మొక్కలు నాటారు. అధ్యాపకుడు రావి సురేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కానూరు అశోక్ జిమ్, మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో సెయింట్ థెరిసా పాఠశాలలో జాతీయ జెండాను ఎగురవేసి మొక్కలు నాటారు.

దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి

అజ్జంపూడి(గన్నవరం): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం అజ్జంపూడి గ్రామ పంచాయితీ కార్యాలయంలో నా దేశం-నా భూమి, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. తొలుత నా దేశం-నా భూమి శిలాఫలకాన్ని సర్పంచి కంచర్ల చిన్నా ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యాలయ ఆవరణలో ఈఓపీఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వర్ణకుమారితో కలిసి సర్పంచ్ మొక్కలు నాటారు. ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం రవికుమార్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు. గన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శిలాఫలాకాన్ని సర్పంచి నిడమర్తి సౌజన్య ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో పంచప్రాణ ప్రతిజ్ఞ చేయించారు.

పలు గ్రామాల్లో నా భూమి-నాదేశం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నాభూమి- నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలలో భాగంగా రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో నాభూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ప్రసాదంపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు పాల్గొని సచివాలయం వద్ద నిర్మించిన శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు.



బొల్లపాడులో శిలాఫలకం వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు

అమరవీరులు, యుద్ధ వీరులకు నివాళులర్పించారు. నిడమానూరు సచివాలయం వద్ద 75 మొక్కలు నాటారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు, ఎంపీడీవో శేషగిరిరావు, ఎంపీటీసీలు దూరు రత్నం, రాచమళ్ల రత్నకుమారి, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

ఉయ్యూరు: మహనీయుల త్యాగఫలమే స్వతంత్ర భారతదేశని సర్పంచ్ తుమ్మూరు సురేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొల్లపాడు గ్రామంలో నా భూమి-నా దేశం కార్యక్రమం గురువారం జరిగింది. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ నిర్మించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో మెలగాలని కోరారు. ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాంచారరావు, ఎంపీడీఓ విమాదేవి, సర్పంచ్ వెనిగళ్ల శిరీష పాల్గొన్నారు.

అమరుల జీవితం ఆదర్శప్రాయం

కంకిపాడు: అమరవీరుల జీవితాలు ఆదర్శప్రాయమని వక్తలు పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈడుపుగల్లు, కుందేరు, మద్దూరు, కందలంపాడు, జగన్నాథపురం గ్రామాల్లో నా భూమి – నా దేశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో పతాకావిష్కరణలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. శిలాఫలాకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈడుపుగల్లులో సర్పంచి పందిపాటి ఇందిర, డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీటీసీ సభ్యుడు బూరగ బాలాజీ, హెచ్‌ఎం పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు కె.వెంకటేశ్వరరావు, బిళ్లా వెంకటేశ్వరరావు, ఈఓ బి.వెంకటేశ్వరరావు, కందలంపాడులో ఈఓఆర్డీ మైథిలి, సర్పంచ్ బాయిరెడ్డి నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మద్దూరు గ్రామ సచివాలయంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి పి.ప్రసాద్, సర్పంచ్ చిప్పల రామదాసు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన ఈడుపుగల్లు పంచాయతీ, జెడ్పీ పాఠశాల, వణుకూరు సచివాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్‌లు పి.ఇందిర, చక్కా విజయ, మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ రావి సురేష్‌బాబు,



ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు

ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు గోగం రాజు, కె.శివనాగేంద్రం పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో నా భూమి-నా దేశం

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నా భూమి-నా దేశం కార్యక్రమాలు జరుగుతాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయభాస్కర్ గురువారం తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని వేల్పూరు, పునాదిపాడు, నెప్పల్లి, చలివేంద్రపాలెం, గొల్లగూడెం గ్రామాల్లో ఈ వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు.

పలు గ్రామాల్లో నా భూమి-నాదేశం కార్యక్రమం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం రేమల్లెలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా 'నా భూమి-నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఆవరణలో 75 మొక్కలు నాటారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం నిర్వహించారు. సర్పంచ్ చొటపల్లి భారతి, ఇన్‌చార్జి హెచ్‌ఎం దారపురెడ్డి భాస్కరరావు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూరంపల్లిలో...

గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో గురువారం నా భూమి, నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పులపాక బాబూరావు, కార్యదర్శి కోట సురేష్‌బాబు, ప్రత్యేకాధికారి దాస్ పాల్గొని శిలాఫలకం ఆవిష్కరించారు. జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. పురుషోత్తపట్నం గ్రామంలో నా భూమి, నా దేశం కార్యక్రమం జరిగింది.

ఉంగుటూరు మండలంలో...

ఉంగుటూరు: మండలంలోని తరిగొప్పల, ఆముదాలపల్లి, ఎలుకపాడు, పెద అవుటపల్లి గ్రామాల్లో నా భూమి-నా దేశం నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పెద అవుటపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొని దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు అర్పించిన యోధుల గురించి వివరించారు. వీరుల శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతమ్మ, స్వయం సహాయక సంఘాల మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

కంకిపాడు: నులిపురుగుల నివారణతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం గురువారం చేపట్టారు. ఉప్పలూరు ఎంపీయూపీ పాఠశాలలో మాత్రల పంపిణీని సర్పంచ్ లాం సోనియా లాంఛనంగా ప్రారంభించారు. డాక్టర్ సుందర్‌కుమార్, వైద్యాధికారి డాక్టర్‌సాయినిఖిత, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, హెల్త్‌సూపర్‌వైజర్ శారమ్మ, హెల్త్ అసిస్టెంట్స్ కెనడీ, రాచమళ్ల శ్యాంప్రసాద్, ఏఎన్ఎం భవాని, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుగులను నులిమేద్దాం

ఉయ్యూరు: నులి పురుగును నులిమేసి ఆరోగ్యకరమైన సమాజాన్ని స్థాపించాలని మునిసిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టారు. ఉయ్యూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాత్రలను అందజేసి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ తేజస్విని నులి పురుగు నివారణ మాత్రల ఆవశ్యకత వివరించారు. కాటూరు పీహెచ్‌సీ పరిధిలో విద్యార్థులకు మాత్రలు అందించారు. వైద్యాధికారి డాక్టర్ దీప కాటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన ఓగిరాల పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ రాకేష్ అనిల్ విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు అందించారు.

ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

పెనమలూరు: నులి పురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలో గురువారం పలు పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండ



ఉప్పలూరులో మాత్రలు వేస్తున్న సర్పంచ్ లాం సోనియా, వైద్యాధికారి సుందర్‌కుమార్

జోల్ మాత్రలు పంపిణీచేశారు. వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నులిపురుగులను నిర్మూలిస్తే రక్తహీనత ఉండదన్నారు. కడుపులో నులి పురుగులు ఉంటే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగుల మందు బిల్లలు పంపిణీ చేశారు.

98.3 శాతం మందికి మాత్రలు

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో 98.3 శాతం మందికి నులి పురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. గురువారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మొత్తం 11657 మంది విద్యార్థులకు గానూ 11459 మందికి మాత్రలు అందజేసినట్లు వివరించారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. వీరపనేని గూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ స్థానిక పాఠశాలల్లో నులి పురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు.

నులిపురుగుల మందుల పంపిణీ

నున్న(విజయవాడరూరల్): జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా నున్న, పరిసర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఎలిమెంటరీ స్కూళ్లు, హైస్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు వైద్య సిబ్బంది నులిపురుగుల నిర్మూలనకు ఆల్‌బెండాజోల్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లోని పిల్లలకు, విద్యార్థులకు టాబ్లెట్లు వేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్ట్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలో రాగి తీగలను అపహరించే దొంగల ముఠాను వీరవల్లి పోలీసులు పట్టుకున్నారు. కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని పలు గ్రామాల్లో 61 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించిన దుండగులు ఎట్టకేలకు పోలీసుల చేతికి చిక్కారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో గన్నవరం డీఎస్పీ జయసూర్య కేసు వివరాలను గురువారం మీడియాకు వెల్లడించారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురానికి చెందిన గండికోట శంకర్, గూడవల్లి వెంకట నరేంద్ర రాజు, మెండాల నరసింహారావు, తేగల కల్యాణ వెంకటేశ్వరరావులను బుధవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి 160 కేజీల రాగి తీగ, రూ.వెయ్యి నగదు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముఠా సభ్యులు దొంగిలించిన ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని రాగితీగను గన్నవరం, పెద్దవుటపల్లి, మచిలీపట్నం, హనుమాన్‌జంక్షన్‌లోని పాత ఇనుప సామగ్రి వ్యాపారులకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించామని డీఎస్పీ తెలిపారు. దీంతో ఈ కేసులో నలుగురు పాత ఇనుప సామాగ్రి వ్యాపారులు, ట్రాన్స్‌ఫార్మర్లు తరలించేందుకు వినియోగిస్తున్న వాహన యజమానిని కూడా నిందితుడిగా చేర్చినట్లు పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, వీరవల్లి ఎస్ఐ చిరంజీవి, ఏఎస్ఐ వై.ఆంజనేయులు, ఇతర కానిస్టేబుళ్లను డీఎస్పీ జయసూర్య అభినందించారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

విజయవాడరూరల్: మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని విజయవాడ రూరల్ మండల పరిషత్ అధ్యక్షురాలు చెన్ను ప్రసన్నకుమారి విజ్ఞప్తి చేశారు. గురువారం మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే ప్రజాప్రతినిధులు,అధికారులు కలిసి కృషి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కె.సువర్ణరాజు మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు ప్రజలతో మమేకమై పనిచేయాలన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి కె.రఘురామ్, పీఆర్ ఏఈ శివరామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, ఏపీఎం చంద్రశేఖర్‌రావు, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మాధురీదేవి తదితరులు తమ తమ శాఖల వివరాలను వెల్లడించారు. అనంతరం అంబాపురం గ్రామ సర్పంచి గండికోట సీతయ్యకు ఇటీవల లూథియానా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినందుకు ఆయన్ను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. సమావేశంలో ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే అల్తాఫ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామవరప్పాడు: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యురాలు అన్నామణి మల్లోలు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే కళాశాలలో గురువారం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు, డి అడిక్షన్ సెంటర్ ప్రతినిధి భవాని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

కంకిపాడు: స్థానిక సంస్థల నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. మండలంలోని కంకిపాడు, ప్రొద్దుటూరు, తెన్నేరు గ్రామాల్లో మూడు వార్డు స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల ఎనిమిది నుంచి పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. కంకిపాడు 9వ వార్డు (జనరల్) స్థానానికి ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నుంచి రెండు, టీడీపీ నుంచి రెండు, జనసేన, బీజేపీ సంయుక్తంగా మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు దారులతో కలిసి ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, పార్టీ నేతలు బండి నాంచారయ్య, తంబాబత్తుల ఓంకారం పాల్గొన్నారు. ప్రొద్దుటూరు 4వ వార్డు (జనరల్ రిజర్వుడు) స్థానానికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నుంచి రెండు, టీడీపీ నుంచి ఒక నామినేషన్ అందించారు. తెన్నేరు ఏడో వార్డు (ఎస్సీ జనరల్) సభ్యుడు కె.మోషేరావు చనిపోయాడు. ప్రస్తుతం ఈ స్థానానికి మోషేరావు సతీమణి కొడాలి మేరిమ్మ ఒక్కరే వైఎస్సార్ సీపీ మద్దతుతో నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆమె ఎన్నిక దాదాపుగా ఏకగ్రీవమే. కార్యక్రమంలో తెన్నేరు, మారేడుమాక సర్పంచ్‌లు జుజ్జవరపు ఎలీషా, సిహెచ్ ఆదర్శకుమార్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కలపాల వజ్రాలు, నాయకులు మట్టా నాగరాజు, సునీల్, లంక వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 11న నామినేషన్ల పరిశీలన ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

చివరి రోజున ఐదు నామినేషన్లు దాఖలు

గన్నవరం: మండలంలో ఖాళీగా ఉన్న మూడు గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికల నిమిత్తం చేపట్టిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం ముగిసింది. మొదటి రెండు రోజులు ఒక నామినేషన్ కూడా రాకపోగా, చివరి రోజు ఏకంగా ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. ముస్తాబాద-1 వార్డుకు ధనకొండ అంజలి, కొండపావులూరు-6వ వార్డుకు కూచిపూడి జ్ఞానసుందరం నామినేషన్లు దాఖలు చేశారు. చిన్నఆవుటపల్లి-6వ వార్డుకు కటికల సుబ్బారావు, కటికల భాగ్యమ్మ, కాండ్రు రాజశేఖర్ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు



తెన్నేరులో నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కొడాలి మేరిమ్మ

తెలిపారు.

9వ వార్డుకి రెండు నామినేషన్లు దాఖలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో 9వ వార్డు సభ్యుని ఉప ఎన్నిక కోసం గురువారం జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు, ఆరేపల్లి ప్రశాంత్ నామినేషన్లు దాఖలు చేశారు. 9వ వార్డుకు పోటీలో మొత్తం ఆరుగురు నామినేషన్లు వేశారని ఆర్‌ఓ శ్రీనివాసరావు తెలియజేశారు.

మండలంలో మూడు వార్డులకు..

గన్నవరంరూరల్: మండలంలోని మూడు గ్రామ పంచాయితీల్లో ఖాళీగా ఉన్న మూడు వార్డులకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. కొండపావులూరులో 1, ముస్తాబాదలో 1, చిన అవుటపల్లిలో 3 నామినేషన్‌లు అధికారులు స్వీకరించారు. ఆ గ్రామాల్లో ఒక్కో వార్డుకు ఎన్నిక జరగనుంది. 11వ తేదీన నామినేషన్‌ల పరిశీలన చేస్తారు.అనంతరం అభ్యంతరాలు స్వీకరిస్తామని ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. కొండపావులూరు, ముస్తాబాదలలో ఒక్కో నామినేషన్ రావటంతో ఆ రెండు ఏకగ్రీవం అయినట్లు భావిస్తున్నారు.

వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్లు

ఉంగుటూరు: మండలంలోని గారపాడు, తుట్టగుంట, ఎన్ఏపేట, తేలప్రోలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. తుట్టగుంట 5వ వార్డుకు ఒకరు, ఎన్ఏ పేట 4వ వార్డుకు ఒకరు, తేలప్రోలు 4వ వార్డుకు నలుగురు నామినేషన్ పత్రాలు సమర్పించగా, గారపాడు 8వ వార్డుకు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు.

బాలికల హక్కులు కాపాడాలి



పెనమలూరు: బాలికల హక్కులు కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సీడీపీఓ జె.పద్మావతి కోరారు. వణుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు నిరోధం తదితర అంశాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. బాలల హక్కులు హరించితే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్రామల్లో బాలలు సమస్యలు ఎదుర్కొంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సూపర్‌వైజర్ టి.రమానాగమణి, డీసీపీయూ శారద, హెచ్‌ఎం రఘురామ్, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ప్రేమలత, నాగరాజు, పద్మలత, డి.కల్పన, రష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం పశు సంరక్షణకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడంతో పాటు పశువులకు అవసరమైన వసతులు అన్ని పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంచారని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎంఎస్ఏ దివాకర్ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని వెటర్నరీ పాలి క్లినిక్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పశుపోషకులతో మాట్లాడి ఆస్పత్రిలో అందే సేవలు, వైద్యుల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరుపట్టీ, ఇతర రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పశువైద్యశాలల్లో వసతులు మెరుగు పడ్డాయ న్నారు. అన్ని వేళలా అత్యవసర సేవలందించేందుకు వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఈ సేవలను పశుపోషకులు వినియోగించుకోవాలని కోరారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ దివాకర్

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): ప్రతి విద్యార్థి చదువును ఇష్టంతో చదివితే జీవితంలో కచ్చితంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ఏ దివాకర్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ హైస్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పది తరగతి విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. హెచ్‌ఎం కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీపీఎస్‌లో వార్షిక అవార్డుల ప్రదానం

రామవరప్పాడు: నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో గురువారం 5వ తరగతి నుంచి వరుసగా ఆరు సంవత్సరాలు అన్ని సబ్జెక్టుల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ ఏజీ సీనియర్ డీఏజీ ఆర్.శ్యామ్ హాజరై బ్యాడ్జి, బ్లేజర్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డేవిడ్‌రాజు, పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో దిగుబడుల అంచనా

ఉంగుటూరు: పంట కోత ప్రయోగం వలన పంట దిగుబడులను అంచనాలు వేయడంతో పాటు దిగుబడి తగ్గిన పొలాలకు బీమా లభిస్తుందని డీవైఎస్‌వో దేవానంద్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగాలపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ పద్మజ, ఏఈవో దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.